ఆదమరిస్తే అంతే సంగతి

ఫాంపాండ్ గుంతకు ఆనుకొని నిర్మిస్తున్న రోడ్డు

- ప్రమాదకరంగా రోడ్డు నిర్మాణం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ములుగు రూరల్, మే 19 : ములుగు జిల్లా కేంద్రం నుంచి దేవగిరిపట్నం మీదుగా పత్తిపల్లి వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు విస్తరణ పనులు ప్రమాదకరంగా మారాయి. గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నిర్మిస్తున్న ఈ రోడ్డులో నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు సైతం పనులను పర్యవేక్షించడం లేదు. ములుగు నుంచి దమ్రమాటు రోడ్డుకు ఇరువైపులా రైతులు గతంలో తమ పొలాల వద్ద ఫాంపాండ్స్ (నీటి నిల్వ కుంటలు) నిర్మించుకున్నారు. కాంట్రాక్టర్ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా ఫాంపాండ్ గుంతల పక్కనే రోడ్డు వేస్తున్నారు. సైడ్ బర్మ్‌ల కోసం స్థలం లేకుండా పోయింది. ఈ రోడ్డు వెంట రాకపోకలు సాగించే వాహనదారులు రోడ్డును ఆనుకొని ఉన్న కుంటను చూసి భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయలేదు. వాహనదారులు ప్రమాదాల బారిన పడకముందే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

రేగొండ, మే 19 : తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు రేగొండకు చెంది గండి సదయ్య వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడగా గాయాలయ్యాయి. వెంటనే తోటి కార్మికులు చికిత్స నిమిత్తం 108లో పరకాల ఆస్పత్రికి తరలించారు.

మాటి మాటికీ కరెంట్ కట్

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- తంటాలు పడుతున్న ఉద్యోగులు
- 11కేవీ మార్పులో నిర్లక్ష్యం

రాత్రి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

ఏటూరునాగారం, మే 19 : గాలి వాన వచ్చిదంటే చాలు మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక 11 కేవీ లైనులో మార్పులు లేకపోవడంతో విద్యుత్ శాఖ ఉద్యోగులు రాత్రి పొలాల్లోకి చీకట్లో వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. 11 కేవీ విద్యుత్ సరఫరాలో మార్పులు చేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినా ఆచరణకు నోచుకోవడం లేదు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, ముత్యాలమ్మ, ఓడ వాడ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు 11 కేవీ లైను నుంచి సరఫరా ఇస్తున్నారు. అయితే మానసపల్లి సమీపంలోని పంట పొలాల మీదుగా సుమారు 50 కరెంటు స్తంభాలు పొడవునా ఈ లైను ఉంది. ఇటీవల వచ్చిన గాలి వానలను పొలాల్లో ఉన్న విద్యుత్ లైను తెగిపోవడంతో సరఫరాలో గంటల తరబడి అంతరాయం ఏర్పడింది. అయితే విద్యుత్ సరఫరాకు ఏర్పడిన అంతరాయాన్ని గుర్తించేందుకు ఉద్యోగులు తంటాలు పడాల్సి వస్తున్నది. గ్రామంలో వైర్లు తెగితే ఎవరో ఒకరు సమాచారం ఇస్తారు. కానీ రాత్రి వేళ పొలాల్లో విద్యుత్ తీగలు తెగితే ఉద్యోగులు వెతుక్కుంటూ పోవాల్సిందే. అర్ధరాత్రి వరకు ఉద్యోగులు తెగిన లైను కోసం పాట్లు పడాల్సి వస్తుంది. ప్రస్తుతం ఉన్న 11 కేవీ లైన్‌ను మరో మార్గంలో మార్చితే 11 కరెంటు స్తంభాలతో ట్రాన్స్‌ఫార్మర్లకు కరెంటు కనెక్షన్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు విద్యుత్ ఉద్యోగులు పేర్కొంటున్నారు. రాత్రి ఉద్యోగులు బురదలో వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల క్రితం గాలి వానకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రాత్రి 11 గంటలకు పొలాల్లో ఉన్న లైను వైరు తెగినట్లు గుర్తించి మొబైల్ ఫోన్ల వెలుతురులో మరమ్మతు చేసి సరఫరా పునరుద్ధరించారు. వర్షంలోను సిబ్బంది వెళ్లాల్సిన వచ్చింది. తరచూ ఏర్పడుతున్న విద్యుత్ సమస్యను అధిగమించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

రైతులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మహదేవపూర్, మే 19 : వరి ధాన్యం కొనుగోళ్లలో మరింత వేగం పెంచాలని జయశంకర్ భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు నిర్వాహకులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని ఎడపల్లి గ్రామ శివారుల్లో మ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పాలని రైతులకు సూచించారు. త్వరితగతిన కొనుగోళ్లను పూర్తి చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సెంటర్ ఇన్‌చార్జి రెహమాన్‌ను వెంకటేశ్వర్లు ఆదేశించారు.

50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

భూపాలపల్లి రూరల్, మే 19 : భూపాలపల్లి పట్టణంలో 50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని మెయిన్ రోడ్డుపై ఆదివారం రాత్రి భూపాలపల్లి ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పోచమ్మగుడి దగ్గర డీసీఎం వ్యాను అనుమానాస్పదంగా నిలిపి ఉంచిన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా తన పేరు సుంకరి రవీందర్ అని, పరకాల ప్రాంతం నుంచి 50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తక్కువ ధరకు కొని యజమాని కక్కెర్ల సంపత్ సహకారంతో సిరొంచ ప్రాంతంలో అమ్మడానికి తీసుకెళ్తున్నట్లు తెలిపాడు. వెంటనే ఎస్సై సదరు వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్

బుద్ధ జయంతిని విజయవంతం చేయాలి

బౌద్ధ మహాసభ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు శ్యామ్

కృష్ణకాలనీ, మే 19 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 23న నిర్వహించనున్న బుద్ధుడి 2,587వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలనని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు కోలా శ్యామ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సింగరేణి ఎస్సీ, ఎస్టీ కార్మికుల అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించి భారతీయ బౌద్ధ మత మహాసభ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశానికే కాకుండా ప్రపంచానికి శాంతి సందేశాన్నిచ్చిన గౌతమ బుద్ధుడి ఆనవాళ్లు భారతదేశంలో ఎక్కడైనా దొరుకుతాయన్నారు. బుద్ధుడి జీవిత చరిత్రను నేటి సమాజానికి తెలిపేందుకు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, జిల్లాలోని అంబేద్కర్, బహుజన వాదులు, వివిధ కుల, బీసీ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని శ్యామ్ కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్రి శివరాజ్, సలహాదారు ఎం భార్గవ్, సేవానాయక్, కోశాధికారి రామిళ్ల రవి, రాష్ట్ర నాయకుడు మేకల శ్రీనివాస్, జిల్లా నాయకులు గోమాస భూమయ్య, కందుగుల రాజన్న, భాస్కర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అవయవ దాన అంగీకార పత్రం అందజేస్తున్న సతీశ్‌రెడ్డి

కేఎంసీకి ప్రభుత్వ ఉపాధ్యాయుడి శరీరదానం

అంగీకార పత్రం అందజేసిన సతీశ్‌రెడ్డి

రేగొండ, మే 19 : ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రచయిత కామిడి సతీశ్‌రెడ్డి కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ)కు తన శరీర దానానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు అంగీకార పత్రాన్ని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ప్రతినిధులకు ఆదివారం అందజేశారు. మండలంలోని రామన్నగూడెం తండాలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న సతీశ్‌రెడ్డి తన మరణానంతరం పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాల విద్యార్థుల వైద్య విద్య కోసం అందించేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కాగా, అంగీకార పత్రాన్ని కేఎంసీ ప్రిన్సిపాల్‌కు అందజేయనున్నట్లు తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కరేటి శంకర్‌రావు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సతీశ్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని పౌర సమాజం నేత్ర, శరీర, అవయవ దానానికి ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా సతీశ్‌రెడ్డిని మండల ప్రజలు, సహ ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లాకు చేరిన 40 శాతం పాఠ్యపుస్తకాలు

భూపాలపల్లి డీఈవో రాంకుమార్

భూపాలపల్లి రూరల్, మే 19 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు 40 శాతం పాఠ్యపుస్తకాలు వచ్చాయని డీఈవో ఎన్ రాంకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు 1,96,110 పాఠ్యపుస్తకాలు, 1,23,831 నోట్‌బుక్స్ అవసరం ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఇప్పటి వరకు 77,460 పాఠ్యపుస్తకాలు, 1,23,831 నోట్ బుక్స్ జిల్లాకు చేరాయని, మిగిలిన పాఠ్యపుస్తకాలు ఈ నెల చివరి వరకు వస్తాయన్నారు. జూన్ మొదటి వారంలో ఎంఈవోలకు పంపించి, పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు ప్రైవేటు పరం కాకుండా వాటిపై స్కాన్, బార్‌కోడింగ్ ముద్రించారని, వీటి ఆధారంగా ఏ జిల్లాకు కేటాయించారో తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఎస్ఈ కిరీటి ఆత్మహత్యపై విచారణ చేపట్టాలి

జీఎం కవీంద్రకు వినతి పత్రాన్ని అందజేస్తున్న సీఎంవోఏఐ అధికారులు

భూపాలపల్లి రూరల్, మే 19 : శ్రీరాంపూర్ ఏరియా ఎన్‌టీపీసీలో ఎస్ఈగా పనిచేస్తున్న కిరీటి ఆత్మహత్య ఘటనపై విచారణ చేపట్టాలని భూపాలపల్లి ఏరియా సింగరేణి ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ ఎస్ కవీంద్రకు సీఎంవోఏఐ అధికారుల సంఘం ప్రతినిధులు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు టీ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పని ఒత్తిడి, విజిలెన్స్ అధికారుల విచారణ పేరుతో వేధించడంతోనే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కిరిటీ లేఖలో పేర్కొన్నారని అన్నారు. కిరీటి ఆత్మహత్యపై విచారణ జరిపించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఐ ఈడీ ఎస్ జ్యోతి, అధికార ప్రతినిధి అజ్మీరా తుకారం, డీజీఎం ఎస్టేట్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

63 ఇసుక లారీలకు జరిమానా

ఏటూరునాగారం, మే 19 : నిబంధనలు అతిక్రమించి జాతీయ రహదారిపై నిలిపిన 63 ఇసుక లారీలకు రూ. 69,425 జరిమానా విధించినట్లు స్థానిక ఎస్సై కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు రోడ్డుపై తనిఖీలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసిన 63 లారీలను గుర్తించారు. జరిమానా విధించి డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి పునరావృతం అయితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్సులు, అనుమతి పత్రాలు పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. ఆయన వెంట కానిస్టేబుల్స్ శ్రీనివాస్, గోపి, అజయ్, లక్ష్మణ్‌నాయక్ తదితరులున్నారు.

ములుగులో కురుస్తున్న వర్షం

పలు గ్రామాల్లో భారీ వర్షం

ములుగు రూరల్, మే19 : ములుగు జిల్లా కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కల్లాల వద్ద వడ్లు ఆరబోసిన రైతులు ఆందోళన చెందారు. ఉదయం నుంచి ఎండ కాయడంతో తడిసిన వడ్లను రైతులు ఎండబోశారు. ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఆరిన వడ్లు మళ్లీ తడిసిపోయాయి. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం రాసులపై పరదాలు కప్పినా ఫలితం లేకుండా పోయింది. గంటన్నర పాటు కురిసిన వర్షం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

విష్ణువర్ధన్‌రెడ్డి (ఫైల్)

ములుగురూరల్, మే19 : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మల్లారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చెరుకుపల్లి సాంబరెడ్డి చిన్న కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి(20) ఆదివారం పురుగుల మందు తాగాడని తెలిపారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం మల్లంపల్లి దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడని తెలిపారు. అతడి ఆత్మహత్యకు కారణం తెలియాల్సి ఉంది. ఈ విషయం తమ దృష్టికి రాలేదని పోలీసులు స్పష్టం చేశారు. విష్ణువర్ధన్‌రెడ్డి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

రామప్ప ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రామప్పలో సండే సందడి

వెంకటాపూర్, మే 19 : మండలంలోని రామప్ప దేవాలయం ఆదివారం పర్యాటకులు, భక్తులతో సందడిగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు, భక్తులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా ఆసక్తిగా విని ఆనందం వ్యక్తం చేశారు. ఆలయంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సులో బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

అపూర్వం.. విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చిట్యాల, మే 19 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2010 బ్యాచ్‌కి చెందిన టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో సందడిగా సాగింది. ప్రస్తుతం ఎక్కడెక్కడో స్థిరపడిన సుమారు 120 మంది 15 ఏళ్ల తర్వాత కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి హెచ్ఎం సారంగపాణితో పాటు ఉపాధ్యాయులు వీరగంటి రవీందర్, నరేందర్, కార్తీక్, సరిత, సదయ్య, ప్రకాశ్, కుమార్, రాధికను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఆత్మీయ విందు ఆరగించారు. తమకు విద్యా బుద్ధులు నేర్పి చనిపోయిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాస్ రమేశ్, మాటూరి లవన్‌బాబు, కుషన్ బాబు, కటుకూరి సునీల్, దాసారపు సృజన్, టేకు సతీశ్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెద్దమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే

చెల్పూర్‌లో పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

గణపురం, మే 19 : మండలంలోని చెల్పూర్‌లో ఆదివారం నిర్వహించిన పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామస్తులు, నిర్వహణ కమిటీ సభ్యులకు పెద్దమ్మతల్లి ఆశీస్సులుండాలని ఆకాంక్షించారు. దేవాలయానికి కాంపౌండ్ వాల్, ఇతర మౌలిక వసతుల కల్పనకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కావటి రవీందర్, సాంబమూర్తి, ఆలయ చైర్మన్ రాందాసు ప్రభాకర్, మాజీ సర్పంచ్ కొత్త వెంకన్న, మాజీ సొసైటీ చైర్మన్ పొనగంటి మలహాల్‌రావు, కంచర్ల కుమార్, వర్తక సంఘం అధ్యక్షుడు వీరవేణి శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

గణపురం, మే 19 : మండల కేంద్రంలో చట్ట వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఆదివారం ఎస్ఐ మచ్చ సాంబమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ మేరకు మూడు కోడిపుంజులు, రెండు కత్తులు స్వాధీనం చేసుకొని 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై తమకు సమాచారం అందించాలని, కోడి పందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొవ్వొత్తుల ర్యాలీ తీస్తున్న డాక్టర్ రవీందర్, వైద్య సిబ్బంది

కొవ్వొత్తుల ర్యాలీ

ములుగురూరల్, మే 19 : ములుగు జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి జాతీయ క్యాండిల్ లైట్ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రొగ్రాం ఆఫీసర్ పోరిక రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి సంవత్సరం మే 3వ ఆదివారం హెచ్ఐవీతో మృతి చెందిన వారి ఆత్మ శాంతి కోసం శ్రద్ధాంజలి ఘటిస్తూ కొవ్వొత్తులు వెలిగించి రెండు నిమిషాల పాటు మౌనం పాటిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ దవాఖాన నుంచి ర్యాలీ నిర్వహించి మౌనం పాటించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జ్యోతి, సిబ్బంది సారయ్య, సాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోసాల కాంగ్రెస్‌ను ఓడించాలి

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి

కృష్ణకాలనీ, మే 19 : అనేక అబద్ధాలాడి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మోసాల కాంగ్రెస్‌ను పట్టభద్రుల ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని బీజేపీ వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 27న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఆదివారం భూపాలపల్లి పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. ధాన్యం ప్రతి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తానని ఆనాడు చెప్పి, ఇప్పుడు కేవలం సన్న వడ్లకు మాత్రమే చెల్లిస్తామనడం సిగ్గుచేటన్నారు. మెగా డీఎస్సీ ఎందుకు వేయలేదో నిరుద్యోగులకు సమాధానం చెప్పి పట్టభద్రుల ఓట్లడగాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోవద్దన్నారు. సమావేశంలో నాయకులు కన్నం యుగదీశ్వర్, వెన్నంపల్లి పాపయ్య, అశోక్‌రెడ్డి, రాజమౌళి, చందుపట్ల సునీల్‌రెడ్డి, లింగంపల్లి ప్రసాదరావు, చల్ల నారాయణరెడ్డి, సామల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హేమాచలుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మంగపేట, మే 19 : మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామి వారి బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. భద్రాచలం సీతారామ చంద్ర స్వామి దేవస్థాన అర్చక బృందం, మల్లూరు దేవస్థాన ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు, రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పది రోజుల పాటు నిర్వహించబోయే వేడుకలకు సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ చేశారు. సోమవారం రమా సహిత సత్యనారాయణ స్వామి తిరుమంజనం, గరుడాధివాసం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమాల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి మహేశ్, అర్చక బృందం పవన్‌కుమార్ ఆచార్యులు, ఈశ్వర్ చందుశర్మ, దేవస్థాన సిబ్బంది సీతారాములు, సుధీర్ భక్తులు పాల్గొన్నారు.

సతీ సమేతంగా స్వామివారిని తీసుకొస్తున్న అర్చకులు

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

భూపాలపల్లి, వాజేడు, ములుగులో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కృష్ణకాలనీ, మే 19 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని శ్రామిక భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బంధు సాయిలు నాయకులతో కలిసి పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించిన గొప్ప నాయకుడు, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయుడు పుచ్చలపల్లి అని అన్నారు. ప్రస్తుత సమాజం ఆయన అడుగుజాడల్లో ముందుకు సాగాలని సాయిలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, రమేశ్, మహేందర్, శేఖర్, లక్ష్మయ్య, ఉషారాణి, కోమల, రజిని, రోజా, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాజేడులో..

వాజేడు : సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని గుడిసెవాసుల కాలనీ వద్ద పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన పేదల కోసం చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జెజ్జరి దామోదర్‌రావు, గుగ్గిళ్ల దేవయ్య, రామలక్ష్మి, సోనియా, సీత, నాగరాజు, సురేశ్ పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలను కొనసాగించాలి

సీపీఎం ములుగు మండల కార్యదర్శి గపూర్

ములుగురూరల్ : పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాల కోసం కృషి చేయాలని సీపీఎం పార్టీ ములుగు మండల కార్యదర్శి ఎండీ గపూర్ అన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొర్ర రాజు, బత్తిని రాజు, రత్నం ప్రవీణ్, శ్రీను, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, HAREESH KUMAR AUKARAPU, S/o. AUKARAPU RAJA CHENNA VISWESWAR, R/o. H.No. 8-11-24, R.N.T. Road, Beside Andhra Bank, Warangal, Warangal Dist.-506002, T.S., India., have Changed my name as AUKARAPU HARISH KUMAR and solemnly declare.
NTW-00

WANTED
jobs Apply Now!
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-323227

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563